# రచ.ఇ.త

అతని అసలు పేరు ఇంబలూర్ తమ్మయ్య. అతను ఎప్పటికప్పుడు కథలు రాయగలడు! ఇప్పటికిప్పుడు రాయగలడు. అందుచేత అతని స్నేహితులు అతణ్ని "ఇప్పటికిప్పటి కథకుడు" అని పిలుస్తూండేవారు. అలా పిలవగా పిలవగా ఆఖరికతను ఇప్పటి తమ్మయ్యగా మిగిలిపోయేడు. ఆ పేరున తను టూకీగా "ఇ.త."గా మారిస్తే, దాన్ని కొంతమంది స్నేహితులు "ఇత్తగాడు" కింద మార్చేరు. అయితే, "ఇ.త."గా అతను ఆంధ్ర పాఠకలోకానికి సుపరిచితుడు! అందులో చాలామందికి అతను అతిప్రియుడు, చదువుకున్నవారు పదిమంది చేరిన చోటుకి ఓ రాయి విసిరితే అది ఇ.త.గారి ఇస్టుల్లో ఒకడికైనా తగిలి తీరుతుంది. పదిరాళ్ళు విసిరితే పదిమందికైనా తగలవచ్చు. నిజం చెప్పాలంటే అతనికి, ఇంట్లో కూర్చొని వీథిలోకి రాళ్ళు రువ్వినట్టు, పాఠకుల మీదికి కథలు విసరడం అంటే చాలా సరదా. ఫలానావాళ్ళకి తగలాలీ అని అతను గురిచూసి కొడుతూంటాడు కూడాను. ఇంకా నిజం చెప్పాలంటే అతనికి రాళ్ళు రువ్వడంలానే కథలు రాయడం కూడా ఎక్కువ అలవాటయింది.

ఇ.త.కి పదిహేనోయేడు వెళ్ళి పదహారో ఏడు వచ్చినప్పుడు వాళ్ళ పక్కింటి అమ్మాయికి పధ్నాలుగోయేడు వెళ్ళి పదిహేనోయేడు వచ్చింది. ఇ.త. అప్పటికప్పుడే మరోరమ, మయూరి, మైదానం, మగువ, తెగువ వగైరా పుస్తకాలు కంఠస్థం చేసి ఉన్నాడేమో నక్కకి నడివయసు వచ్చినట్టు మాంచి పెంకితనంగా ఉండేవాడు. అతని పక్కింటి అమ్మాయి ఆ పుస్తకాలేమీ చదవలేదు; కాని వంటరిగా డాబా మీద పడుకొని చంద్రున్ని, చుక్కల్నీ చూడాలనే ఆకాంక్ష ఆమెలో ఉత్పన్నమయింది. ఆ పిల్ల అలా డాబామీద వంటరిగా ఉండే సమయాల్లోనే ఇ.త.కి కూడా డాబామీద ఎక్కాలనే అభిలాష కలిగేది. కాని, సాయంకాలాలవేళ మైదానం మీదకి ఆటలకి పోకుండా డాబాలమీద బీటుకి నిల్చునే కుర్రవాళ్ళని పక్కింటి పెద్దలు ఓ కంట కనిపెడుతూ వుంటారని ఇ.త. కనుక్కోలేకపోయాడు. ఓనాటి సాయంకాలపు టారుగంటల శీతాకాలపు మసకవెన్నెల్లో పక్కింటి డాబామీద పడుకున్న ఆడపిల్ల మీదికి ఇ.త. ఒక రాయి (చాలా చిన్నది, ఎంతో ముద్దుది, "ప్రేమరాయి" అనే పేరు గలది ఓ రాయి.) విసిరాడు. రాయి విసిరేక అతను అక్కడ పడుకున్నది, ఆడపిల్లకాదనీ, "ఆడపులి" పేరుగల ఆమె మేనత్త అనీ తెలుసుకున్నాడు. ఆ మేనత్త వెంటనే అరుపులు అరచి తన తమ్ముణ్ని ఇ.త. మీదకి ఉసిగొల్పింది. తమ్ముడంటే చిన్న బుల్లి తమ్ముడు కాదు. ముప్పయేళ్ళవాడే అయినప్పటికి ముప్పైరెండేళ్ళ అక్కకి అతను తమ్ముడే. అతను వచ్చి ఇ.త.ది ఇంతేవున్న పిలక పట్టుకొని వీపు చీరేశాడు. దాన్తో పెద్ద అల్లరయిపోయింది. ఇ.త. తల్లి (ఇ.త.కి తండ్రిలేదు, అందుచేత తల్లే) వెళ్ళి పక్కింటివాళ్ళ కాళ్ళు పట్టుకొని, వాళ్ళ కోపం తగ్గించడానికి వాళ్ళ కళ్ళముందే తను కూడా ఇ.త.ని పట్టుకొని ఓ ఉతుకు ఉతికేసింది. ఆ తగువు అంతటితో చల్లారింది.

కాని ఇ.తగారి మనసులో క్రోధం చల్లారలేదు. చేతనైన వాడి కోపం చేతుల్లో వుంటుంది. మరి కొందరి కోపం రాతల్లో ఉంటుంది.

అంతకు ముందు అతను చాలా కథలు రాసేడు. కాని అవి పబ్లిష్ కాలేదు. కాని ఈ కథ మాత్రం అతను చాలా జాగ్రత్తగా రాసేడు. చల్లారని వీపుమంటతో చాలా పట్టుదలగా రాశాడు.

ఆ కథలో -

ఒక నవయువకుడు పదహారేళ్ళ వాడుంటాడు. అతను గాఢంగా ఓ యువతిని ప్రేమిస్తాడు. ఆమెకూడా ఆ విధంగానే చేస్తుంది. కాని, "స్వర్గంలో సర్పం, గులాబికి ముళ్ళు. మణికీ ఫణీ ఉన్నట్టుగా ఆమెకు ఒక మేనత్త ఉంటుంది, ఆమె బాల విధవ, ఇల్లుబట్టిన విధవాడబడుచూను. ఆమె వీరి ప్రేమకు అడ్డుతగులూ వుంటుంది. ఓనాడు ప్రేమ యువతి కాబోలు తన డాబామీద పడుకొని ఉండగా ఆ ప్రేమయువకుడు సాంకేతికంగా చిన్నరాయి విసురుతాడు. ఆమె సాంకేతికంగా కుడిచెయ్యి ఎత్తి దించుతుంది. అప్పుడు యువకుడు తన డాబామీద నుంచి ఆమె డాబామీదికి లంఘించి ఆమెని చేరేసరికి ఆమె యువతికాదు; విధవాడబడుచు! ప్రేమ యువకుడు ఆశ్చర్యపోయాడు. కాని, ఆవిడ ఆశ్చర్యకరంగా, మౌనంగా, దీనాతిదీనంగా అతని చేయి పట్టుకొని ఏదో అర్థించే సమయానికి ఆవిడ తమ్ముడు వస్తాడు. అతను ప్రళయ రుద్రుడవుతాడు. విధవాడబడుచు బిక్కు బిక్కు చూపులు చూస్తుంది. పులికి దొరికిపోయిన హరిణంలా ఉంటుందావిడ. ఆ చూపు చూడగానే ప్రేమయువకుళ్ళో జాలి కెరటాలులేస్తాయి. ఆ విధవరాలిలోని తీరని కోరికల బాధనతడు అర్థం చేసుకుంటాడు. తన భావాల్ని అర్థం చేసుకోకుండా తన మేనగోడలి యవ్వనాన్ని కామించినందుకు ఆవిడలోని ఉండే అనురాగం అ యువకుని ఎడల కోపంగా మారిందేకాని మరొకలా కాదని అతను గ్రహిస్తాడు. ఆమె నిజభావం క్షణంలో అతనికి అర్థమౌతుంది. పునర్వివాహమేకాని ఆవిడ చేసుకోగలిగినట్లయితే, ఈ సంఘం ఆవిణ్ని చేసుకోనిచ్చినట్లయితే ఆవిడకి ఆ దురవస్థ తప్పేది కదా అని అతను లోలోన వాపోతాడు. ఆవిడ పరువు కాపాడ్డానికి తను ఏ త్యాగమైనా చేయాలనుకుంటాడు. ఆవిడ చాలా అందంగా ఉంటుంది. ఆవిడకి తల ఉంటుంది. చేతులకి బంగారపువి జత గాజులుంటాయి. అప్పుడు ఆ యువకుడు ఆమె చేతిది ఓ గాజులాగి ఆమె తమ్ముడికి వినబడేలాగున "ఏవండీ! ఏవండీ! క్షమించండి మీ గాజు మీరు తీసుకోండి! మరెప్పుడు దొంగతనం చెయ్యనండి!" అంటాడు. ఆవిడ "కృతజ్ఞతాపూర్వక దృష్టుల్తో అతణ్ని తడిపి ముంచెత్తుతుంది." అప్పుడు "దొంగవెధవా" అంటూ ఆవిడ అన్నగారో, తమ్ముడుగారో కాని అతను ఆ యువకుణ్ని పట్టుకొని "వీపు చీరేస్తాడు." అంతలో అసలైన ప్రేమ యువతికూడా ఆ అల్లరి విని అక్కడికి వస్తుంది. యువకుడు యువతిని చూడకుండా దృష్టి తప్పించుకుంటాడు. విధవావిడ తన మేడకోడల్ని కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంది. యువకుడ్ని ఆవిడ తమ్ముడు చితక్కొట్టి విడిచిపెడతాడు, పోలీసువారికి అప్పజెప్పాడు. (ఎందుచేతనంటే; ఇ.త.గారి జీవితంలోకి పోలీసులు అప్పటికి ఇంకా రాలేదు.) ఆ రాత్రి ఆ దెబ్బలకి మూలుగుతాడే కాని ప్రేమ యువకుడు సంతృప్తిగా నిద్రపోతాడు.

ఆ కథలో ఆ విధంగా జరుగుతుంది.

పదహారోయేట అంత మంచికథ రాయగలిగినందుకు కథక కిశోరాలన్నీ ఇ.తని ఆకాశానికి ఎత్తేసేయి. "స్వర్గంలో సర్పం," "గులాబీముల్లు", అని ఎవరైనా అనగలరు, కాని "మణికి ఫణి అనడం చాలా కష్టం అన్నాయి కిశోరాలన్నీ కూడా. "అంతే కాదు అంత చిన్నవయసులో స్త్రీ బాధనీ, స్త్రీ హృదయాన్నీ అర్థం చేసుకొని అంత చక్కగా రాయగలగాలంటే దాని వెనుక ఎంతో స్వానుభవం ఉండి ఉండాలని కూడా కథక కిశోరాలన్నాయి. ఆ పొగడ్తకి యువ ఇ.త. ఎంతో ముద్దుగా సిగ్గుపడ్డాడు.

అదీ సంగతి! ఆ కథతో ఇంబట్ళూర్ తమ్మయ్య పెద్ద కథకుడయేడు. అతనికి చక్కని కీర్తి, పత్రికనుంచి వందరూపాయల చెక్కూ వచ్చేయి. చెక్కులేని కీర్తికంటే చెక్కుతో వచ్చిన కీర్తి ఎంతో ఆనందదాయకమని అతను దాన్తో తెలుసుకున్నాడు. అతను పెట్టిన పేరు "స్త్రీ దుర్భరం నీ జీవితం!"

ఆ కథానికా రచయిత బట్ళూర్ తమ్మయ్య ఆ కథానికా రచనతో "రచ.ఇ.త"గా మారేడు, ప్రఖ్యాతి చెందేడు.

ఆ తర్వాత ఓ చిన్న ప్రమాదం జరిగింది. అది రచ.ఇ.త కి జరగలేదు. ఆ కథ చదివేక అది అందరూ చదివి తననే చూస్తున్నారని తెలుసుకున్నాక యువ రచ.ఇతైన ఇ.త గారి పక్కింటివారి విధవ మేనత్త ఊరవతల చెరువులో పడింది. "నిజం నిప్పులాంటిదయి నప్పుడు ఆవిడ అలా చేస్తే మనమేం చేస్తాం?" అని ఇ.త. గారి ముదురు స్నేహితుడొకాయన అన్నాడు. ఇ.త కూడా ఆమె చావు గురించి యిదేమాట అన్నాడు.

30·8·1968

***ఆంధ్రజ్యోతి వారపత్రిక, ఆగష్టు, 1968***